ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
బుధవారం 7 ఆగస్టు 2024



● లోకేశ్ చొరవ



సౌదీలో బాధితురాలికి బాసటగా కందూరువాసి

'అప్పుల బాధ నుంచి గట్టెక్కాలని డబ్బు సంపాదన కోసం సౌదీఅరేబియాకు వచ్చాను. ఇక్కడ సేఠ్‌లు నాకు నరకాన్ని చూపిస్తున్నారు. ఇక్కడి నుంచి ఇండియాకు రప్పించండి సార్..' అంటూ ఓ మహిళ పంపిన వీడియో వైరల్‌గా మారింది. ట్విటర్‌లో దీనిని కొందరు మంత్రి నారా లోకేశ్‌కు ట్యాగ్ చేశారు. ఆయన చొరవతో సౌదీలోని ఏపీ ఎన్నార్టీ ప్రతినిధి, సోమల మండలం కందూరుకు చెందిన చిట్టలూరి రంజిత్ ఆమెకు బాసటగా నిలిచారు. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలం తురకపల్లికి చెందిన హసీనా(25)కు స్వగ్రామంలోనే హసన్‌అలీతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. ఆర్థిక సమస్యల నేపథ్యంలో నెల కిందట సౌదీ వెళ్లిన ఆమె.. అక్కడ వేధింపులు భరించలేక వీడియో పెట్టారు. తనను రక్షించాలంటూ మంత్రి నారా లోకేశ్‌కు చేసిన విన్నపం ఫలించింది. ఆయన చొరవతో సౌదీ అరేబియాలోని ఏపీ ఎన్నార్టీ ప్రతినిధి, సోమల మండలం కందూరుకు చెందిన చిట్టలూరి రంజిత్, మరో ప్రతినిధి ముజ్జమ్మిల్ షేక్ సాయంతో మంగళవారం హసీనాను సురక్షితంగా రియాద్ నగరంలోని భారతీయ ఎంబసీ అధికారులకు అప్పగించారు. కొన్ని రోజుల నుంచి సరిగా తిండిలేక నీరసించిపోయిన ఆమెకు భోజన ఏర్పాట్లు చేయించారు. ఆర్థికసాయం అందించారు.ఈమెను సురక్షితంగా చేర్చిన విషయాన్ని తెలుగుదేశం పార్టీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణతో పాటు విజయవాడలోని ఏపీ ఎన్నార్టీ అధికారులకు కూడా వారు సమాచారమిచ్చారు. సౌదీ అధికారుల సాయంతో ఆమె వీసాను రద్దు చేసి స్వదేశానికి పంపించడానికి ఎంబసీ అధికారులు ప్రయత్నిస్తారని రంజిత్ చెప్పారు.

- ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

● నేను సైతం



సహాయక చర్యల్లో పూతలపట్టు యువకుడు

వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును కర్రల వంతెనపై నుంచి దాటుతున్న ఈ ఆర్మీ ఉద్యోగి పేరు దామోదర్. ఈయనది మండల కేంద్రమైన పూతలపట్టు. ఇక్కడి పల్లెవీధిలో నివాసం ఉంటున్న ఈయన ఆర్మీలో చేరారు. ఈనెల 2వ తేదీన వరదల ధాటికి కొండ చరియలు విరిగిపడి హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని రామ్‌పూర్ చమోజ్ గ్రామం భూమిలోకి కుంగిపోయిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మృతదేహాలను వెలికితీసేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఐటీబీపీ, ఆర్మీ సిబ్బంది, ఆర్మీ మేజర్ వాస్నిక్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపడుతున్నారు. ఈ సహాయక చర్యల్లో పూతలపట్టు యువకుడైన ఆర్మీ ఉద్యోగి దామోదర్ కూడా చురుగ్గా పాల్గొంటున్నారు.

- పూతలపట్టు

● వర్షం హర్షం

బంగారుపాళ్యంలో 126.2 మిమీ

నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం 8 నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకు రొంపిచెర్ల, పుంగనూరు మండలాలు మినహా మిగిలిన 30 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షాలు కురిశాయి. అత్యధికంగా బంగారుపాళ్యంలో 126.2, అత్యల్పంగా నింద్రలో 1.2 మిమీ వర్షపాతం నమోదైంది. శ్రీరంగరాజపురంలో 37.2, సదుంలో 28.2, చిత్తూరు రూరల్‌లో 27.2, నగరిలో 21.4, బైరెడ్డిపల్లిలో 20.0, రామకుప్పంలో 19.2, తవణంపల్లెలో 18.0, పాలసముద్రంలో 16.2, యాదమరిలో 15.6, కార్వేటినగరంలో 15.2, శాంతిపురంలో 13.2, గంగవరంలో 12.6, గుడిపాలలో 11.4, గుడుపల్లిలో 11.2, పలమనేరులో 11.0, వెదురుకుప్పంలో 10.2, గంగాధరనెల్లూరులో 9.2, చిత్తూరులో 8.4, ఐరాలలో 7.2, కుప్పంలో 7.0, సోమలలో 6.8, వి.కోటలో 4.6, పూతలపట్టులో 4.2, విజయపురంలో 3.8, పెనుమూరులో 2.0, పెద్దపంజాణిలో 1.8, చౌడేపల్లెలో 1.4, పులిచెర్లలో 1.2 మిమీ చొప్పున వర్షం కురిసింది.



- చిత్తూరు కలెక్టరేట్

రైల్వే స్టేషన్ల ఆధునికీకరణను వేగవంతం చేయాలి

చిత్తూరు సిటీ, ఆగస్టు 6: కుప్పం, చిత్తూరు, చంద్రగిరి రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలని ఇండియన్ రైల్వే బోర్డు చైర్మన్‌ను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. ఢిల్లీలో మంగళవారం పార్లమెంటు సమావేశాలకు హాజరైన ఆయన రైల్వే బోర్డు చైర్మన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌ను కుప్పం వరకు కొనసాగించేలా చర్యలు చేపట్టాలని, తిరుపతి- సికింద్రాబాద్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్రతిరోజూ నడిచేలా చూడాలని కోరారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, రాష్ట్రాల్లో కొత్త రైల్వేజంక్షన్ల ఏర్పాటుకు చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు.

మామిడితోటల్లో ఇసుక డంపుల సీజ్



పలమనేరు, ఆగస్టు 6: పలమనేరు మండలం ముసలిమడుగు గ్రామ పరిసరాల్లోని మామిడి తోటల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను మంగళవారం ఆర్డీవో మనోజ్‌రెడ్డి సీజ్ చేశారు. గ్రామ సమీపంలోని కౌండిన్య నది నుంచి కొందరు అక్రమార్కులు ఇసుకను తరలించి మామిడి తోటల్లో అక్కడక్కడా నిల్వ ఉంచారు. ఈ విషయమై శనివారం కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన మంగళవారం తహసీల్దార్ ఇన్బనాథన్, పంచాయతీ కార్యదర్శితో కలిసి ముసలి మడుగు సమీపంలోని మామిడితోటల్లో ఇసుక డంపులను గుర్తించారు. ఈ డంపుల్లో 300 టన్నులకు పైగా ఇసుక ఉంటుందని అంచనా. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలించినా, నిల్వ ఉంచినా చట్టపరమైన చర్యలు తీసుకొంటామని ఆర్డీవో హెచ్చరించారు. కాగా, కొందరు తమ ఇసుక డంప్‌లను ఆదివారం మరోచోటుకు తరలించేశారని గ్రామస్తులు తెలిపారు.

ఇన్నాళ్లు సమస్యలే లేవా?

గత ఐదేళ్లలో..

పుంగనూరు నియోజకవర్గంలో ఎక్కడా సమస్యలే లేవన్నట్లుగా పరిస్థితి ఉండేది. ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చే వాళ్లూ కాదు. మంత్రి హోదాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనల్లోనూ సమస్యలపై బాధితుల వినతులు అంతంతమాత్రంగానే ఉండేవి.

ఇప్పుడు..

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి నియోజకవర్గ పర్యటన సందర్భంగా సోమవారం కుప్పలు తెప్పలుగా వినతులు వచ్చాయి. ప్రతిచోటా అర్జీలివ్వడానికి బాధితులు, ప్రజలు క్యూ కట్టారు. ఇచ్చిన అర్జీల్లో ఎక్కువగా రెవెన్యూ శాఖవే ఉన్నాయి.

ఎందుకిలా..?

వైసీపీ పాలనలో దౌర్జన్యానికి పాల్పడింది.. భూములు లాక్కుంది.. వేధింపులకు గురిచేసింది పెద్దిరెడ్డి మనుషులే. వారిపైనే ఆయనకు, అధికారులకు వినతిపత్రాలిచ్చినా ఫలితం ఉండదని ప్రజలు భావించినట్లున్నారు. సమస్యలను ప్రస్తావించినా స్పందన ఉండదన్న నిర్ణయానికి వచ్చినట్లున్నారు. అర్జీలిచ్చి 'సమస్య' కొని తెచ్చుకోవడం ఎందుకని కొందరు వెనకడుగు వేసినట్లున్నారు. అందుకే ఐదేళ్లలో అర్జీలతో జనం కనిపించలేదు.



సదుంలో సోమవారం ప్రజలు తనకు అందజేసిన వినతులను చూపిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

- కూటమి అధికారంలోకి రాగానే పుంగనూరులో కుప్పలు తెప్పలుగా వినతులు
- మంత్రి, అధికారులకు అర్జీలివ్వడానికి క్యూ కడుతున్న బాధితులు
- అత్యధిక ఫిర్యాదులు రెవెన్యూ శాఖవే
- పెద్దిరెడ్డి వీరభక్త అధికారుల అక్రమాలు సరిదిద్దాలని విజ్ఞప్తులు

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో పుంగనూరు నియోజకవర్గంలో భయం రాజ్యమేలింది. దౌర్జన్యాలు, అక్రమాలకు అంతేలేకుండా పోయింది. సమస్యల పరిష్కారాన్ని ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. భూముల రికార్డుల తారుమారు, ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం, పూర్వీకుల నుంచి అనువంశికంగా వచ్చిన భూములను ఇతరులకు చెందినవిగా పేర్కొన్నారు. అన్ని సర్వేనెంబర్లు నమోదు చేయకుండా కొన్నింటినే రికార్డుల్లో చూపారు. అన్ని హక్కులు, రికార్డులున్నా తమ భూములు ఇతరులకు చెందినవిగా కోర్టుల్లో కేసులు వేయడం, హక్కుదారుల భూములను వన్‌బీలో చూపకుండా హోల్డ్‌లో పెట్టడం వంటి సంఘటనలు జరిగాయి. సెటిల్‌మెంట్ పట్టాలను దేవదాయ, ప్రభుత్వ భూములుగా పేర్కొని 22ఏ జాబితాలో చేర్చి పలువురిని ఇబ్బంది పెట్టారు. పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నా, భూమి అనుభవంలో ఉన్నా పేర్లు మార్చేసేవారు. , వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు అనేక చోట్ల రైతులు, ప్రజలను బెదిరించి భూములను రాయించుకోవడం, అతి తక్కువ ధరకు కొనడం, డీకేటీ భూములు రద్దు చేసినట్లు ఆక్రమించడం, వివిధ రకాల లిటిగేషన్లతో అడ్వాన్స్‌లు ఇచ్చి భూములు స్వాధీనం చేసుకుని మిగిలిన సొమ్ము ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడం వంటి ఘటనలు ఎన్నో జరిగాయి. విలువైన ప్రాంతాల్లో వైసీపీ శ్రేణులు గత అధికారుల ప్రోత్సాహంతో వంకలు, కాల్వలు, నదులను ఆక్రమించారు.

ప్రాజెక్టుల ముంపు రైతుల గోడు వర్ణనాతీతం

నేతిగుట్లపల్లె, ఆవులపల్లె, అన్నమయ్య జిల్లా ముదివేడు ప్రాజెక్టుల పనులను పెద్దిరెడ్డి సంస్థ చేసింది. వీటి పరిధిలోని వందలాది మంది రైతులకు చెందిన వేలాది ఎకరాల భూములు, గ్రామాలు, ఆస్తులకు రూపాయి నష్టపరిహారం కూడా ఇవ్వలేదు. అధికార బలంతో పనులు చేశారు. అడ్డుకున్న పలువురిపై అక్రమ కేసులు.. ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసులు పెట్టారు. పరిశ్రమల పేరుతో వందల ఎకరాలకు తక్కువ ధరతో వైసీపీ నేతలు రైతుల నుంచి భూములు ఇప్పించగా.. కొంతమంది భూములు ఇవ్వకుండా అభ్యంతరం తెలిపారు.

అక్రమార్కులకు అధికారుల అండ

పుంగనూరు నియోజకవర్గంలో గత ఐదేళ్ల పాలనలో భూముల ఆక్రమించిన వైసీపీ శ్రేణులకు నాటి రెవెన్యూ అధికారుల మద్దతు ఉందన్న విమర్శలున్నాయి. ఇక పోలీసు శాఖలో డీఎస్పీ నుంచి సీఐలు, ఎస్‌ఐలు పెద్దిరెడ్డి వీరభక్త పోలీసు అధికారులుగా వ్యవహరించి రైతులు, ప్రజలను బెదిరించడం, తప్పుడు కేసులు పెట్టి వేధించి రైతులు భూములు వదులుకునేలా చేశారనే ఆరోపణలున్నాయి. అక్రమాలు అడ్డుకోవాల్సిన పలుశాఖల అధికారులు నియోజకవర్గంలో ఏకపక్షంగా వైసీపీకి అప్పజెప్పేలా నిర్ణయాలు తీసుకున్నారు. పుంగనూరు మండలం రాగానిపల్లె వద్ద గల 982.48 ఎకరాల భూమిని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం, వైసీపీ అనుచరులకు గతేడాది జాయింట్ కలెక్టర్ అప్పజెబుతూ ఉత్తర్వులిచ్చారు. దీనిపై పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి జోక్యం చేసుకుని అక్రమంగా 982.48 ఎకరాలు భూమి పెద్దిరెడ్డి కుటుంబం స్వాహా చేస్తున్నారని భూమికి చెందిన వారసులైన అర్హుల వద్ద ఫిర్యాదు చేయించగా నాటి జేసీ ఉత్తర్వులు రద్దుపై పుంగనూరు తహసీల్దార్ సీసీఎల్ఏ కోర్టులో పిటిషన్ వేయగా కేసు నడుస్తోంది.

అంతటి అరాచకం జరిగినా..

నియోజకవర్గంలో అన్ని స్థాయిల్లోనూ అరాచకం జరిగినా.. వైసీపీ నేతల వేధింపులకు భయపడి ప్రజలు నోరు తెరవలేదు. అధికారులూ ఒకవైపే ఉండటంతో వినతిపత్రాలూ ఇవ్వలేదు. ఫిర్యాదులూ చేయలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో నాటి బాధితులంతా బయటకు వస్తున్నారు. మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి అర్జీలివ్వడానికి క్యూకట్టారు. పెద్దిరెడ్డి సొంత మండలమైన సదుం బస్టాండులో సోమవారం వందలమంది వివిధ సమస్యలపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతులు ఇచ్చారు. పుంగనూరు ప్రజాదర్బార్‌తో బాటు నియోజకవర్గంలో దారి పొడవునా భూసమస్యల బాధితులు, వైసీపీ కక్షతో ఇబ్బందులు పడిన వారు వందల మంది తమకు న్యాయం చేయాలని భారీగా వినతులు, ఫిర్యాదులందించారు. అర్జీలపై విచారించి బాధితులకు అండగా ఉంటామని, పెద్దిరెడ్డి బాధితులకు న్యాయం చేస్తామని రాంప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు.

- పుంగనూరు

తుపాకీతో బెదిరించి టీడీపీ కార్యకర్త కిడ్నాప్.. దాడి



పుంగనూరులో ఆర్వీటీ బాబు ఇంటి వద్ద గుమిగూడిన టీడీపీ శ్రేణులు

- పుంగనూరులో టీడీపీ శ్రేణుల ఆందోళన
- నిందితులను అరెస్టు చేయాలని ఫిర్యాదు

పుంగనూరు, ఆగస్టు 6: బహిర్భూమికి వెళ్లిన టీడీపీ కార్యకర్తను తుపాకీతో బెదిరించి కిడ్నాప్ చేసి దాడి చేశారు. నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ పుంగనూరు టీడీపీ శ్రేణులు మంగళవారం ఆందోళనకు దిగారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. పుంగనూరులో సోమవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పర్యటనలో భాగంగా భీమగానిపల్లె పంచాయతీ కమతంపల్లెకు చెందిన వైసీపీ కార్యకర్త శ్రీనివాసులు, మరికొందరు వచ్చారు. మంత్రిపై పూలు చల్లడంతో టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తమను ఇబ్బందులు పెట్టి మళ్లీ ఎలా వస్తారంటూ టీడీపీ నాయకులు ప్రశ్నించారు. మాటామాటా పెరిగి గొడవ జరిగింది. ఈ క్రమంలో ఎన్నికల ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన పుంగనూరు నేత ఆర్వీటీ బాబును వైసీపీకి చెందిన భీమగానిపల్లె మాజీ ఎంపీటీసీ హేమచంద్ర తదితరులు కలిసి మంత్రి పర్యటనలో తమ వారిపై దాడి జరిగిందని చెప్పారు. తన అనుచరులపై దాడి చేస్తారా అంటూ ఆయన ఆగ్రహించారు. ఆర్వీటీ బాబు అనుచరులు కొందరు, ప్రైవేటు గన్‌మ్యాన్ మంగళవారం ఉదయం భీమగానిపల్లెకి చెందిన టీడీపీ నాయకుడు రామాంజులు కుమారుడు డి.మణికంఠ గ్రామ సమీపంలోని చెరువువద్ద ఉండగా పట్టుకున్నారు. తుపాకీ చూపి చంపేస్తామని బెదిరించి కిడ్నాప్ చేశారు. పుంగనూరులోని ఆర్వీటీ బాబు ఇంటికి తీసుకెళ్లి నిర్బంధించారు. ఈ విషయం తెలిసి భీమగానిపల్లె నుంచి భారీగా టీడీపీ శ్రేణులు.. ఆ పార్టీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు మణికంఠను విడిపించేందుకు ఆర్వీటీ బాబు ఇంటికి బయల్దేరారు. ఈ విషయం తెలిసి సీఐ జయరామయ్య సిబ్బందితో వెళ్లి టీడీపీ వారిని అడ్డుకుని గొడవ చేయరాదని సూచించారు. మణికంఠను విడుదల చేసి, నిందితులను అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని టీడీపీ శ్రేణులు డిమాండు చేశారు. ఆర్వీటీ బాబు ఇంటి లోపల ఉన్న టీడీపీ కార్యకర్త మణికంఠ, ప్రైవేట్ గన్‌మ్యాన్‌ను పోలీసులు పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. తమకు న్యాయం చేయాలంటూ టీడీపీ శ్రేణులూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఈ ఘటనపై రాజీ చేయాలని ఆర్వీటీ బాబుకు మద్దతుగా మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ సీఐతో మాట్లాడారు. టీడీపీ నేత ఆర్వీటీ బాబు, వైసీపీకి చెందిన హేమచంద్ర, డ్రైవర్ హరి, ప్రసాద్, శీనా, హరి, నరేశ్, కిషోర్‌తో పాటు మరికొందరు తనను కొట్టి, తుపాకీతో బెదిరించారని బాధితుడు మణికంఠ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము మణికంఠను కిడ్నాప్ చేయలేదని, ఇంటి వద్దకు పిలిపించి గొడవలు చేయకుండా కలసిమెలసి ఉండాలని చెప్పినట్లు ఆర్వీటీ బాబు చెప్పారు. ఇటీవల టీడీపీలో చేరిన ఈయన వైసీపీ శ్రేణులతో కలిసిమెలసి ఉంటూ అసలైన టీడీపీ వారిని ఇబ్బంది పెట్టడం తగదని నాయకులు అంటున్నారు. ఈ ఘటనపై పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదు.



పోలీస్‌స్టేషన్ వద్దకు చేరిన టీడీపీ శ్రేణులు

పరిశ్రమగా కుప్పం శిల్పకళ

- సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి
- కళాకారుల్ని, వారి ఉత్పత్తుల్ని ప్రోత్సహిస్తూ కార్యాచరణ
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేసేలా ప్రణాళికలు
- నిల్వ, మార్కెటింగ్‌కు 25 ఎకరాల కేటాయింపు

చిత్తూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రాంతంలో శిల్ప కళాకారులను ప్రోత్సహించి, తగిన సౌకర్యాలను అందించి, వారి జీవన విధానంలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. దీని కోసం ఇండస్ట్రీస్ జీఎం, కుప్పం ఆర్డీవో, ఎండోమెంట్స్ ఏసీ, లేబర్ ఏసీలతో ఓ కమిటీని ఏర్పాటుచేశారు. ఈ నలుగురు అధికారుల బృందం 10 రోజుల్లో మూడు కేటగిరీల్లో అవసరమైన అన్నిరకాల వివరాలను సేకరిస్తుంది. ఒకటో కేటగిరీలో భాగంగా శిల్పాలు తయారుచేసే వ్యక్తుల్ని గుర్తిస్తారు. వీరంతా సుమారు వెయ్యి మంది వరకు ఉంటారని అంచనా వేస్తున్నారు. 10- 20 మందితో కలిపి పనిచేయించే మేస్త్రీలను గుర్తిస్తారు. వీరంతా ఓ వంద మంది వరకు ఉండొచ్చని అంచనా. వీరందరికీ అవసరమైన గ్రానైట్ రా మెటీరియల్‌ను సప్లై చేసే వారిని మూడో కేటగిరీ కింద గుర్తిస్తారు. వీరు కూడా వంద మంది వరకు ఉండొచ్చు. 'వీరికి ఎలాంటి సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించాలి. రా మెటీరియల్‌కు ఎంతవరకు రాయితీ ఇవ్వచ్చు. ఆరోగ్య బీమా, వారికి వర్తించే కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా వేసి ఇవ్వడం' వంటి సదుపాయాలు కల్పించేందుకు ఈ కమిటీ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. వీటితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో.. ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున మార్కెటింగ్ కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వారి ఉత్పత్తుల్ని నిల్వ ఉంచి విదేశాలకు ఎగుమతి చేసేలా ఆలోచిస్తున్నారు. దీనికోసం 25 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తిస్తున్నారు.మంగళవారం జేసీ శ్రీనివాసులు కుప్పంలో పర్యటించారు.కుప్పాన్ని శిల్ప కళా హబ్‌గా మారిస్తే ఇక్కడ ఉన్న కళాకారులతో పాటు బయటివారు కూడా ఇక్కడికొచ్చి స్థిరపడే అవకాశాలున్నాయి. అంతే కాకుండా రాష్ట్రంలో ఎక్కడైనా గుడి గోపురాలు, పార్కులు నిర్మించినా.. అక్కడ అవసరమైన విగ్రహాలు, శిల్పాలను ప్రభుత్వం తరఫున ఇక్కడి నుంచే సరఫరా చేసేలా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఫైనల్‌గా ఈ శిల్ప తయారీ రంగాన్ని పెద్ద పరిశ్రమగా ఏర్పాటు చేసేందుకు సీఎం ఆలోచనలతో అధికారులు ముందడుగు వేస్తున్నారు.

స్విమ్స్ డైరెక్టర్ ఎవరు?



టీటీడీ నిర్వహణలో ఉన్న శ్రీవేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ (స్విమ్స్) డైరెక్టర్‌గా ఎవరు రాబోతున్నారు అనే చర్చ వైద్య వర్గాల్లో జోరుగా సాగుతోంది. ప్రస్తుత డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ పదవీకాలం రెండేళ్లపాటు ఉన్నప్పటికీ ప్రభుత్వం మారడంతో ఈయన స్థానంలో కొత్తవారికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. రాజకీయ నాయకులతో సఖ్యతగా ఉండే రవికుమార్, టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు ప్రభుత్వం మారగానే మొదలుపెట్టారని అంటున్నారు. నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో కార్డియోథొరాసిక్ సర్జన్‌గా పనిచేస్తున్న ఆర్వీ కుమార్‌ను వైసీపీ ప్రభుత్వంలో స్విమ్స్ డీమ్డ్ వర్సిటీ వైస్ చాన్సలర్ కమ్ డైరెక్టర్‌గా ప్రతిష్టాత్మకమైన బాధ్యతలు అప్పగించారు. స్విమ్స్‌లో ఉన్న సీనియర్లను పట్టించుకోకుండా ఈయన్ను తీసుకురావడంపై అప్పట్లో వైద్యవర్గాల్లో చర్చ జరిగింది కూడా. అయితే వైసీపీ నాయకులకు ఆగమేఘాల మీద వైద్య సేవలు ఇంటికే అందిస్తూ ఈయన వారి మెప్పు పొందారు. నిజానికి గుండె వైద్య నిపుణుడిగా స్విమ్స్‌లో పేరున్న సీనియర్ డాక్టర్ రాజశేఖర్‌కు వెంగమ్మ తర్వాత డైరెక్టర్ పదవి లభిస్తుందని అందరూ భావించారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి బాగా సన్నిహితుడిగా కూడా పేరున్నందున ఈయనకు పదవి లభిస్తుందని అనుకున్నా అప్పటి సీఎం జగన్ పేషీ నుంచి రవికుమార్ పేరు అనూహ్యంగా తెరమీదకు వచ్చింది. ఇప్పుడు మళ్లీ డాక్టర్ రాజశేఖర్ పేరు వినిపిస్తోంది. బర్డ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ పేరు కూడా బలంగానే వినిపిస్తోంది. అయితే ఆయన వయసు రీత్యా సాధ్యం కాదేమో అనే అనుమానాలూ ఉన్నాయి. మరోవైపు మాజీ డైరెక్టర్ వెంగమ్మ పేరు కూడా ప్రస్తావనకు వస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో అత్యంత అవమానకర రీతిలో ఆమెను పంపేసినందున కూటమి ప్రభుత్వం ఆమె పేరును సానుకూలంగా పరిశీలించవచ్చని కొందరు అంటున్నారు.

ఐఏఎస్‌ను నియమిస్తారా?

ఇలా వుంటే స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద ఆస్పత్రులను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి.. ఒక డైరెక్టర్‌ను ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదన ఎప్పటినుంచో ఉంది. ఒకవేళ ఈ అంశం తెరపైకి వస్తే ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించే అవకాశాలూ లేకపోలేదు. ఏదిఏమైనా టీటీడీ పాలకమండలి నియామకం జరిగిన తర్వాతే స్విమ్స్ డైరెక్టర్ మార్పులు జరిగే అవకాశం ఉంటుందని అంటున్నారు. రాయలసీమకే తలమానికం అయిన స్విమ్స్ సారథ్య బాధ్యతలను రాజకీయ కోణంలోంచి చూసి కాకుండా ప్రతిభావంతులకు అప్పగిస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. పేదలకూ మంచి వైద్యం అందుతుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అర్ధరాత్రి దీపాల పేరుతో మోసాలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 6: ముక్కంటి ఆలయ పరిసరాల్లో అర్ధరాత్రి వేళ కొందరు దళారీలు దీపాల పేరుతో భక్తులను భారీగా మోసం చేస్తున్నారు. ఆలయం పరిసరాల్లోని 1వ గేటు, 2వ గేటు సమీపంలో భక్తులు రాత్రి వేళ నిద్రిస్తుంటారు. ఉదయం వీరికి కొందరు దీపాలు వెలిగిస్తే దోషం పోతుందంటూ నమ్మిస్తారు. అలా నకిలీ నేతి దీపాలను భక్తులకు అంటగడుతూ చాలా ఏళ్లగా దందాలు సాగిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఉదయం వేళ భక్తులను మోసగించే ప్రక్రియకు స్వస్తి పలికారు. అయితే గుట్టు చప్పుడు కాకుండా అర్ధరాత్రి పాపాల దీపాలను విక్రయిస్తున్నారు. రాత్రి ఒంటి గంట నుంచి 1వ గేటు, 2వ గేటు సమీపంలోని భక్తులను కొందరు దళారీలు హడావుడిగా నిద్ర లేపేస్తున్నారు. అక్కడికి సమీపంలోని కాశీ విశ్వనాథస్వామి సన్నిధి, వీరభద్రస్వామి సన్నిధి, వాయుమూల గణపతి వద్ద ప్రతి ఒక్క భక్తుడూ వేర్వేరుగా మూడు దీపాలు వెలిగించాలంటూ నమ్మిస్తున్నారు. ఒక్కో దీపానికి రూ.500 చొప్పున ఒక్కో భక్తుడి నుంచి రూ.1,500 వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. భక్తులను మోసగించే ఈ తరహా దొంగలు ఉదయం ఐదు గంటల్లోగా ఈ దందాను ముగిస్తున్నారు. అర్ధరాత్రి ఆలయంలో దోషం పేరుతో ఇలా భక్తులను దోపిడీ చేయడం సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్‌గా మారింది.



అర్ధరాత్రి భక్తులు వెలిగించిన దీపాలు

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు భవనాల పరిశీలన



గుడుపల్లె, ఆగస్టు 6: కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన భవనాలను మంగళవారం ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఇన్‌చార్జి వీసీ దొరస్వామి, విద్యాలయ అధికారులు పరిశీలించారు. ఈ ఏడాది నుంచే కుప్పం నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభించాలని సీఎం చంద్రబాబు సంకల్పించారు. దీంతో ద్రావిడ వర్సిటీలోని హరప్ప భవనం, గురుకులం భవనాలను అధికారులు పరిశీలించారు. గురుకుల భవనం అనువైనదిగా భావించారు. చిన్న చిన్న మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసరాజు, డీటీ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌వి ఫ్యాక్షన్ రాజకీయాలు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్



మీడియాతో మాట్లాడుతున్న సీఆర్ రాజన్

గుడిపాల, ఆగస్టు 6: గ్రూపు రాజకీయాలతో వైసీపీ నేతలు హత్యలు చేసుకుంటుంటే అది టీడీపీపై రుద్దడం జగన్ ఫ్యాక్షన్ రాజకీయానికి నిదర్శనమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ విమర్శించారు. మంగళవారం గుడిపాలలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ ఇంకా అధికారంలో ఉన్నట్లే ఊహించుకుంటూ తనకిష్టమొచ్చినట్లు వ్యాఖ్యలు చేస్తూ ప్రశాంతంగా ఉన్న రాష్ట్ర ప్రజలను రెచ్చగొట్టేలా చేయడం సబబు కాదన్నారు. బీసీలకు గుర్తింపు ఇచ్చిన ఏకైక నాయకుడు చంద్రబాబే అన్నారు. మీ ఉనికిని కాపాడుకోవడం కోసం ప్రభుత్వంపై బురదచల్లితే, ఇప్పుడిచ్చిన 11 మంది ఎమ్మెల్యేల సంఖ్య సున్నా అవుతుందన్నారు. పార్టీనేతలు రాధాకృష్ణ, సుమతి మురళీనాయుడు, ఉదయ్, త్రిమూర్తి, విజయ్, జయచంద్ర నాయుడు, బాబు నాయుడు, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

'ఎర్ర'దొంగల అరెస్టు




స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం సహా నిందితుడితో పోలీసులు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 6: మండలంలోని పిల్లారికుప్పం గ్రామ సమీపంలో గల మామిడితోపులో రెండు రోజుల క్రితం దొరికిన ఎర్రచందనానికి సంబంధించి ఐదుగురు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఆర్‌పురం ఎస్ఐ కుళాయిప్ప తెలిపారు. ఆయన చెప్పిన వివరాల మేరకు.. మాజీ సైనికుడు రవినాయుడు తన పొలంలో ఉన్న ఎర్రచందనం చెట్లను అటవీ శాఖ అనుమతితో డ్రెసింగ్ చేసి, అక్కడే ఉన్న గోడౌన్‌లో భద్రపరిచారు. గతనెల 23వ తేదీ అదే గ్రామానికి చెందిన వైసీపీ నేతలు కొందరు దుంగలను దొంగిలించి, ట్రాక్టర్‌లో వెంకటాపురం సమీపంలో కొండవద్ద డంప్ చేశారు, సమాచారం తెలుసుకున్న పోలీసులు వారి నుంచి 37 ఎర్రచందనం దుంగలను, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. దానికి సంబంధించి మంగళవారం సుదర్శన్(21), బాలాజీ(32), చరణ్(29), మోహన్‌రాజ్(38), గురవయ్య(39)లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కుళాయిప్ప తెలిపారు. కాగా, నిందితులను కాపాడాలని ప్రయత్నిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే థామస్ మంగళవారం కార్వేటినగరం సీఐ సత్తిబాబు, ఎస్ఐ కుళాయప్పలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

డీఎడ్ ఫెయిలైన అభ్యర్థులకు సప్లిమెంటరీ పరీక్షలకు అవకాశం

కార్వేటినగరం, ఆగస్టు 6: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో డీఎడ్ రెగ్యులర్, స్పాట్ అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని కార్వేటినగరం డైట్ ప్రిన్సిపాల్ శేఖర్ విలేకరులకు తెలిపారు. 2018-20 సంవత్సరాల మధ్య ప్రైవేటు డీఎడ్ కాలేజీలో అడ్మిషన్లు పొంది ఫెయిలైన అభ్యర్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయటానికి విద్యాశాఖ అనుమతించింది. మరిన్ని వివరాల కోసం కార్వేటినగరం డైట్ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

కేరళ వరద బాధితులకు ఆటోడ్రైవర్ ఆర్థికసాయం



కలెక్టర్‌కు చెక్ అందజేస్తున్న రమేష్‌బాబు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 6: గత వారం కేరళ రాష్ట్రంలో జరిగిన వరద బీభత్సానికి చలించిన గుడిపాల మండలం 189 కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ జి.రమేష్‌బాబు తనవంతుగా రూ.3,300 విరాళంగా ఇచ్చారు. మంగళవారం సాయంత్రం ఇందుకు సంబంధించిన చెక్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అందజేశారు. డ్రైవర్ దాతృత్వాన్ని కలెక్టర్ అభినందించారు.

పుత్తూరుకు చెందిన అసిస్టెంట్ ఎడిటర్ మృతి

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సినీ అసిస్టెంట్ ఎడిటర్‌గా పని చేస్తున్న తిరుపతి జిల్లా పుత్తూరుకు చెందిన మణిరత్నంరెడ్డి వడపళనిలో మృతి చెందారు. 'టౌన్‌బస్' అనే లాడ్జిలో బస చేసిన ఆయన వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం. మంగళవారం ఉదయం మందులు కొనుగోలు చేసేందుకు లాడ్జి నుంచి బయటకు రాగానే స్పృహ తప్పి పడిపోయారు. దీనిని గమనించిన చుట్టుపక్కల వారు 108 అంబులెన్సును రప్పించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలిసింది. ఆయన మృతదేహాన్ని కేకే నగర్ ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎవరు?

● పంద్రాగస్టున జాతీయ పతాకాన్ని ఎగురవేసేదెవరో?

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 6: జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి నియామకం ఇంకా జరగలేదు. మరో పది రోజుల్లో చిత్తూరులో జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో జాతీయ జెండాను ఎవరు ఎగురవేస్తారో, జిల్లా ప్రగతిపై ప్రజలకు ఎవరు సందేశమిస్తారో తెలియడం లేదు. ఆలోగా ఇన్‌చార్జి మంత్రి నియామకం పూర్తికాకుంటే ఎవరిచే పోలీసు పరేడ్ మైదానంలో త్రివర్ణ పతాకం ఎగురవేస్తారన్నది అర్థం కావడం లేదు. జిల్లాకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్ప మరెవరూ మంత్రులుగా లేరు. ఈ క్రమంలో జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి నియామకం జరగని పక్షంలో సీనియర్ మంత్రుల్లో ఒకరికి అవకాశం కల్పిస్తారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులను నియమించడం కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ప్రతి మూడు నెలలకోసారి జిల్లా సమీక్షా మండలి సమావేశం నిర్వహిస్తారు. జిల్లా ప్రగతిని సూచించే వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించి తీర్మానాలను ఆమోదించి ప్రభుత్వానికి పంపించేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మంత్రి ఉషశ్రీ చరణ్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరించారు. ఆమె జిల్లా ఇన్‌చార్జిమంత్రిగా ఉన్నా అన్ని సమావేశాల్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి హవానే కొనసాగేది. ఆ తర్వాత ఎన్నికల వాతావరణం రావడం, మార్చిలో ఎన్నికల కోడ్ ప్రకటించడంతో డీఆర్సీ నిర్వహించే అవకాశం లేకపోయింది. ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. ఇంకా ఇన్‌చార్జి మంత్రిని ప్రకటించలేదు.

3500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం లక్ష్యం



వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 6: రానున్న వంద రోజుల్లో జిల్లావ్యాప్తంగా 3500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో సూక్ష్మనీటి సాగు పథకం ద్వారా బిందు సేద్యం, తుంపర్ల సేద్యానికి సంబంధించి పరికరాల పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఏడాది బిందు, తుంపర్ల సేద్యం లక్ష్యం 21వేల హెక్టార్లు కాగా, రానున్న వంద రోజుల్లో మరో 3500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు. ఇందుకోసం రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వెంటనే చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రస్తుతం కొనసాగుతున్న ఈ-క్రాప్ నమోదు జరుగుతోందని, దీంతోపాటు రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో 7500 ఎకరాల్లో హార్టికల్చర్ ప్లాంటేషన్ లక్ష్యం కాగా, ఇంతవరకు 5500 ఎకరాలను గుర్తించినట్లు డ్వామా పీడీ రాజశేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం, పట్టు పరిశ్రమశాఖ అధికారిణి శోభారాణి, డివిజన్, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఏనుగుల కదలికపై అప్రమత్తత అవసరం



అవగాహన శిబిరంలో మాట్లాడుతున్న చైతన్యకుమార్‌రెడ్డి

రామకుప్పం, ఆగస్టు 6: ఏనుగుల కదలికలను తెలుసుకునే విషయంలో ట్రాకర్లు, అటవీ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని అటవీశాఖ జిల్లా అధికారి చైతన్యకుమార్‌రెడ్డి, కడా ప్రాజెక్టు అధికారి వికాస్‌మర్మత్ సూచించారు. ఏనుగుల కదలికలు, మదపుటేనుగులను బంధించే విధానంపై రామకుప్పం మండలం ననియాల ఎలిఫెంట్‌క్యాంపులో రెండు రోజులపాటు నిర్వహించే అవగాహన శిబిరాన్ని మంగళవారం వీరు ప్రారంభించి మాట్లాడారు. ఏనుగుల కదలికలను గుర్తించేటపుడు ఎంతో ఓపిక కలిగి ఉండాలన్నారు. మదపుటేనుగులతో పాటు సాధారణ ఏనుగులు కూడా కొన్నిసార్లు దాడులకు పాల్పడే అవకాశాలుంటాయన్నారు. దాడుల నుంచి తప్పించుకునే మెలకువలను అలవర్చుకోవాలన్నారు. ప్రజలు కూడా బాధ్యతాయుతంగా ప్రవర్తించి వన్యప్రాణుల రక్షణ, వనసంరక్షణకు కృషి చేయాలని కోరారు. అనంతరం తిరుపతి జూపార్క్ క్యూరేటర్ సెల్వం, మదపుటేనుగుల పట్టివేతలో నిపుణులైన రిటైర్డ్ ఎఫ్ఆర్వో రఘునాథ్, తమిళనాడుకు చెందిన విశ్రాంత అటవీ అధికారులు తంగరాజ, సత్యప్రకాష్, మనోహరన్ ఏనుగుల కదలికలు, మదపుటేనుగుల పట్టివేత తదితర కార్యకలాపాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, కుప్పం, పుంగనూరు క్షేత్రాధికారులు జయశంకర్, శ్రీరాములు, ఉపక్షేత్రాధికారులు ధనుంజయుడు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిపై వేటు తప్పదు

బీసీవై అధినేత రామచంద్ర యాదవ్



హర్షకుమార్ నివాసంలో విలేకరులతో మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 6: వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై వేటు తప్పదని బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో అమలాపురం మాజీ ఎంపీ, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ జీవీ హర్షకుమార్‌ను మంగళవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా వారు కొద్దిసేపు పోలవరం, వర్గీకరణ అంశాలపై చర్చించుకున్నారు. అనంతరం రామచంద్ర యాదవ్ విలేకరులతో మాట్లాడారు. పెద్దిరెడ్డి ఎన్నిక చెల్లదన్నారు. అక్కడ జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో ఆధారాలతో న్యాయస్థానానికి నివేదించానన్నారు. అతని ఎన్నిక అనైతికమని, త్వరలోనే పెదిరెడ్డిపై వేటు తప్పదని అన్నారు. ఇక రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అనేక లోపాలు ఉన్నాయని చెప్పారు. వాటిని పరిశీలించి, సరి చేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాజ్యాంగ సవరణ జరిగి పార్లమెంట్‌లో తీర్మానం చేశాక సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వాల్సి ఉండగా దానికి విరుద్ధంగా జరిగిందన్నారు. వర్గీకరణ వ్యతిరేక ఉద్యమానికి తమ బీసీ నేతలతో చర్చించి మద్దతు ఇస్తామన్నారు. అనంతరం హర్షకుమార్ మాట్లాడుతూ... పోలవరం డయాఫ్రం వాల్, కాఫర్ డ్యామ్ నిర్మాణాల్లో అనేక లోపాలున్నాయన్నారు. ఆలోపాలపైన, వర్గీకరణపైన త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని రామచంద్రయాదవ్, తాను నిర్ణయించుకున్నామని చెప్పారు.



గోవిందా.. గోవిందా..!



తిరుమలలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి శ్రీవారి ఆలయం ముందు కొంత ప్రదేశం వరకు నెయ్యితో కూడిన మురుగు పొంగింది. దర్శనానంతరం ఆలయం బయటకు వచ్చేవారు, ప్రసాదాలు తీసుకొచ్చే భక్తులు దీనిపై కాలు వేయడంతో జారిపడి గాయపడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

చిరుత పులా.. రేసు కుక్కలా?

రామచంద్రాపురం, ఆగస్టు 6: అడవి జంతువు ఓ దూడను చంపి తిన్న సంఘటన రామచంద్రాపురం మండలం పరమాల అటవీ ప్రాంత సమీపంలోని పొలాల వద్ద సోమవారం రాత్రి జరిగింది. పరమాలకు చెందిన శేషమ్మ సోమవారం సాయంత్రం అటవీ ప్రాంత సమీపంలోని తమ పొలం వద్ద రెండు ఆవులతోపాటు ఓ దూడను కట్టి ఇంటికి వచ్చింది. మంగళవారం ఉదయం ఆవు పాలు తీయడానికి పొలం వద్దకు వెళ్లగా.. దూడను గుర్తు తెలియని అడవి జంతువు చంపి సగం తిన్నట్లు గుర్తించింది. గ్రామస్తులకు తెలపగా వారు అటవీశాఖ అధికారి కిషోర్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అడవి జంతువు పాదముద్రలు సేకరించి ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఆ నివేదిక వస్తే గానీ ఏ జంతువు దూడను చంపిందో గుర్తించలేమన్నారు. ఎన్నో ఏళ్లుగా తమ పొలాల వద్ద పశువులను కట్టేస్తున్నప్పటికీ ఇలాంటి ఘటన ఇంతకు మునుపు జరగకపోవడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. దూడను చంపింది చిరుత పులా, రేసు కుక్కలా అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య



మృతిచెందిన పురుషోత్తం

గంగవరం, ఆగస్టు 6 : భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య చేసుకున్న వైనమిది. పోలీసుల కథనం మేరకు... నడింపల్లెకు చెందిన పురుషోత్తానికి ఏడేళ్ల క్రితం మంజులతో పెళ్లయింది. వీరికి ఒక కుమార్తె ఉంది. కొద్దిరోజులుగా పురుషోత్తం మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో నాలుగురోజుల క్రితం భార్యను పుట్టింటికి పంపించేశాడు. తరువాత అత్తవారింటికి వెళ్లి కాపురానికి రావాలని భార్యను కోరాడు. ఆమె అంగీకరించకపోవడంతో మనస్థాపం చెంది స్వగ్రామానికి వచ్చేశాడు. ఇంట్లో ఉరివేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోలీసులు పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పంట నష్టపోయిన రైతులకు చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, ఆగస్టు 6: ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులకు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే మురళీమోహన్ చేతులమీదుగా మంగళవారం చెక్కులు పంపిణీ చేశారు. ఏనుగుల దాడిలో మరణించిన బలిజపల్లికి చెందిన చిన్నబ్బ కుటుంబ సభ్యులకు రూ.5లక్షలు, గాయపడిన పాలేరు గ్రామానికి చెందిన పద్మనాభరెడ్డికి రూ.69వేలు చెక్కులు అందించారు. అలాగే 91 మంది రైతులకు పంట నష్టపరిహారం కింద రూ.5.11లక్షలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏనుగుల దాడుల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, ఎన్‌పీ ధరణీ నాయుడు, కోదండయాదవ్, కోకా ప్రకాష్ నాయుడు, కమల్‌నాథ్ రెడ్డి, ఎఫ్ఎస్‌వో షబీనా తాజ్, బీట్ ఆఫీసర్ ప్రతాప్, పద్మావతి, ఢిల్లీరాణి పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలు తొలగించండి: కడా పీడీ



చెరువును పరిశీలిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, ఆగస్టు 6:ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారంలో భాగంగా కడా పీడీ వికాస్ మర్మత్ గ్రామాల్లో పర్యటిస్తున్నారు. శాంతిపురం మండలం శివరామపురం పంచాయతీ, నంజంపేట గ్రామ సర్వే నెంబర్ 28/1లోని బొమ్మకంటి చెరువును ఆయన మంగళవారం పరిశీలించారు. సుమారు 35.70 ఎకరాల ఈ చెరువులో ఆక్రమణలను వెంటనే తొలగించాలనే ఫిర్యాదు మేరకు వెళ్లి చూశారు. గ్రామస్థుల సమక్షంలో చెరువును సర్వే చేసి హద్దులు చూపించాలని మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆక్రమణలు ఉంటే నోటీసులు ఇచ్చి తొలగించాలని చెప్పారు. పంచాయతీ నిధులతో ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి చెరువు ఆక్రమణలకు గురికాకుండా ట్రెంచ్ కొట్టించాలని ఆదేశించారు. డీటీ కౌలేష్, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌బజార్‌కు నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ



పలమనేరు, ఆగస్టు6 : స్థానిక సూపర్‌బజార్‌కు నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి గత పర్సన్ ఇన్‌చార్జి పదవీ కాలం ఈనెల 4న ముగిసిన నేపథ్యంలో అధికారులు కొత్త కమిటీని నియమించారు. కమిటీ అధ్యక్షుడిగా ఆర్‌వీ బాలాజి, ఉపాధ్యక్షుడిగా పి. సుధాకరరెడ్డి(వి.కోట), సభ్యులుగా కె.చంద్రశేఖర్‌రెడ్డి(బైరెడ్డిపల్లి), బి.సత్యమూర్తి(పలమనేరు టౌన్), జగదీష్‌నాయుడు(పలమనేరు టౌన్), కె. శ్రీరాములు(పెద్దపంజాణి), అశ్రఫ్‌అలి(వి.కోట), బి. సెల్వరాజు(పలమనేరుమండలం), టి.శీనప్ప(గంగవరం). కె.కోటీశ్వర్లు(పలమనేరుటౌన్) మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన దేవదాయ అసిస్టెంట్ కమిషనర్

పలమనేరు, ఆగస్టు6 : ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని మంగళవారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామక్రిష్ణారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. చంద్రగిరి మండలంలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో ఈనెల 7,8,9 తేదీల్లో జరిగే సహస్ర కలశ కుంభాభిషేకానికి హాజరు కావాలని కోరారు. ఆమేరకు ఆలయ నిర్వాహకులు ముద్రించిన ఆహ్వాన పత్రికను అమరనాథరెడ్డికి అందజేశారు.

ప్రభుత్వాసుపత్రిలో రికార్డుల తనిఖీ



సూచనలిస్తున్న శ్రీనివాసరావు

పలమనేరు, ఆగస్టు6 : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం రాష్ట్ర హెచ్ఎంఐఎస్ ఉప సంచాలకులు శీనివాసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జనన, మరణ రికార్డులను పరిశీలించారు. జనన, మరణ రికార్డుల్లో తప్పని సరిగా ఆధార్‌ను పొందుపరచాలన్నారు. జన్మించిన 15 సంవత్సరాల వరకు కేవలం రూ.10 చెల్లించి పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. ఎప్పటికప్పుడు వివరాలను హెచ్ఐఎస్ పోర్టర్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణపై సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ శారద, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరులోపు ఆర్టీసీ డిపో సమస్యల పరిష్కారం



అమరనాథరెడ్డికి సమస్యల వినతి పత్రం అందజేస్తున్న ఆర్టీసీ డిపో ఉద్యోగులు

పలమనేరు, ఆగస్టు6 : స్థానిక ఆర్టీసీ డిపోలోని సమస్యలను ఈనెలాఖరులోపు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చెప్పారు. మంగళవారం పలమనేరు డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు అమరనాథరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్థానిక డిపో పరిధిలోని సర్వీసులు, ఉద్యోగుల సమస్యల గురించి ఆయనకు వివరించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో అధ్యక్షులు కె.ఎస్. బాబు, డిపో కార్యదర్శి ఎన్.ఎం. రత్నం, సహకార్యదర్శి అఫ్రోజ్‌తో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎవరికి కష్టం వచ్చినా అండగా ఉంటా: చల్లాబాబు



చల్లాబాబుకు సమస్యలు వివరిస్తున్న పులిచెర్ల టీడీపీ నాయకులు

రొంపిచెర్ల,ఆగస్టు6: నియోజకవర్గంలో ఎవరికి కష్టం వచ్చినా అండగా ఉంటానని నియోజకర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి చెప్పారు. మంగళవారం రొంపిచెర్లలో ఆయనను పుంగనూరు, రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలకు చెందిన వారు కలిసి సమస్యలు వివరించారు. వైసీపీ నుంచి పలువురు టీడీపీలోకి వచ్చేందుకు మండల టీడీపీ నాయకులతో చర్చిస్తున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. చల్లాబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో కష్టకాలంలో అండగా ఉన్న వారికి పార్టీ అండదండలు ఎప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. చల్లాను కలిసిన వారిలో కల్లూరు సర్పంచ్ షకూర్ సాహెబ్, వైస్ఎంపీపీ రాశిప్రసాద్, రెడ్డీబాబుల్లా, జి.ఇమ్రాన్‌ఖాన్, షేక్ కరీముల్లా, రామమూర్తి, మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శివారెడ్డి తల్లి మృతికి సంతాపం

పెళ్లికనుమలో టీడీపీ నాయకుడు శివారెడ్డి తల్లి భౌతికాయానికి చల్లారామచంద్రారెడ్డితో పాటు పలువురు టీడీపీ నాయకులు వద్ద పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి:యూటీఎఫ్



మాట్లాడుతున్న సోమశేఖర్‌నాయుడు

కల్లూరు, ఆగస్టు 6: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు, కార్యదర్శి ఈశ్వర్ మహేంద్ర కోరారు. ఎల్లంకివారిపల్లి, మంగళంపేట, పులిచెర్ల, కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను మంగళవారం యూటీఎఫ్ నాయకుల బృందం పర్యటించింది. వారు మాట్లాడుతూ పెండింగ్‌లోని పీఎఫ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ప్రాథమిక విద్యారంగాన్ని గాడిలో పెట్టాలన్నారు. జీవో నెంబర్ 53 ప్రకారం విధులు సరి చేయాలన్నారు. నాయకులు విజయ్‌కుమార్, హరి, కరుణాకర్‌రెడ్డి, వెంకటశివ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నష్టాలపై అవగాహన



సదస్సులో హరికృష్ణ,తదితరులు

పుంగనూరు రూరల్, ఆగస్టు6: మాదక ద్రవ్యాలు వాడకం వల్ల జీవితాలు నాశనం అవుతాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ హరికృష్ణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శుభారం ప్రభుత్వ డిగ్రీకాలేజీలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వల్ల క్యాన్సర్ లాంటి భయంకరమైన రోగాలు వస్తాయన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ రాజశేఖర్, సుబ్రహ్మణ్యం,అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు

కుప్పం/పుంగనూరు

అమరావతి నిర్మాణానికి విరాళం



కమిషనర్‌కు చెక్ అందజేస్తున్న సమాఖ్య సభ్యులు

కుప్పం, ఆగస్టు 6: కుప్పం పురపాక సంఘం పరిధిలో రాజధాని అమరావతి నిర్మాణానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. చీమనాయనిపల్లె (లక్ష్మీపురం) సచివాలయంలో మంగళవారం వార్డు మహిళా సమాఖ్య సమావేశం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. మహిళా సమాఖ్య సభ్యులు రాజధాని అమరావతి నిర్మాణం కోసం రూ.57,500 విరాళంగా ప్రకటించారు. మున్సిపల్ కమిషనర్‌కు చెక్కు రూపంలో ఆమొత్తాన్ని అందజేశారు. మహిళా సమాఖ్య సభ్యులను కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు లోకేశ్, రవి, బాబు, మెప్మా సిబ్బంది, సీవోలు జగదీశ్, శోభ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు



వైద్య సేవలపై ఆరా తీస్తున్న ప్రభావతీదేవి

కల్లూరు, ఆగస్టు 6: ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించేలా పనిచేయాలని జిల్లా ప్రభుత్వ వైద్యాధికారి ప్రభావతీదేవి సిబ్బందికి సూచించారు. కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. రోగుల గదులను, మందుల స్టాక్ రిజిస్టర్, ఓపీ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రాత్రి వేళలో స్టాఫ్ నర్సు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. అత్యవసర సేవలు అందించాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు గ్రామాల్లో పర్యటించి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా చైతన్య పరచాలని సూచించారు. ఆమె వెంట సోమల వైద్యాధికారి జయసింహ, స్టాఫ్‌నర్సు మంజుల ఉన్నారు.

రేపటి నుంచి తిరుపతికి రెండు ఆర్టీసీ సర్వీసులు

కల్లూరు, ఆగస్టు 6: పుంగనూరు డిపో నుంచి పులిచెర్ల, రొంపిచెర్ల క్రాస్, చిన్నగొట్టిగల్లు, బాకరాపేట మీదుగా తిరుపతికి గురువారం నుంచి రెండు సర్వీసులు నడపనున్నట్లు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండల ప్రజలు చేసిన వినతిపై స్పందించిన ఆయన మంగళవారం జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి జితేందర్‌రెడ్డితో మాట్లాడారు. ఈ సందర్భంగా చల్లాబాబు మాట్లాడుతూ పులిచెర్ల మండల ప్రజల సౌకర్యార్థం రెండు సర్వీసులను నడిపేలా ఆర్టీసీ డీఎం సుదాకరయ్యను జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి ఆదేశించారన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పుంగనూరు రూరల్, ఆగస్టు6: పేకాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ జయరామయ్య తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశారు. వనమలదిన్నె వీఆర్వో నాగేశ్వర్‌రెడ్డితో పాటు ఆరుగురు పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. రూ.10500 స్వాధీనం చేసుకున్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు6: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎంసీపల్లె పంచాయతీ కుర్రపల్లెకు చెందిన కృష్ణప్ప కుమారుడు రెడ్డెప్ప మంగళవారం ద్విచక్రవాహనంలో నాటుకోళ్లు తీసుకుని మదనపల్లె రోడ్డులో విక్రయిస్తున్నాడు. ఇదే సమయంలో అతడిని కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రెడ్డెప్పను మదనపల్లెకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నగల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

గంగవరం, ఆగస్టు 6 : బంగారం చోరీకేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు అర్బన్ సీఐ చిన్నగోవిందు తెలిపారు. ఆయన వివరాలమేరకు.. కీలపట్లలో ఈనెల 2న ఇంటికి వేసిన తాళం పగులగొట్టి బంగారం తీసుకుపోయారు. యజమాని కుమరేష్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈక్రమంలో మంగళవారం మేలుమాయి క్రాస్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న గురుమూర్తి అనే యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. కీలపట్లల చోరీ చేసింది తానేనని అంగీకరించాడు. నిందితుడిని అరెస్ట్ చేసి రూ.1.50 లక్షల విలువచేసే బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు.

వివాదాస్పద స్థలంపై మళ్లీ రగడ

బైరెడ్డిపల్లె, ఆగస్టు 6 : స్థానిక నాలుగు రోడ్లకూడలిలో వివాదాస్పద స్థలంవద్ద మంగళవారం మళ్లీ గొడవ జరిగింది. ఈ స్థలంపై అటవీశాఖకు, ప్రైవేటు వ్యక్తులకు మధ్య వివాదముంది. మంగళవారం నిర్మాణపనులు చేపట్టడానికి వచ్చిన కూలీలను అటవీశాఖ సిబ్బంది అడ్డుకున్నారు. దుర్భాషలాడి విధులకు ఆటంకం కలిగించారని సిబ్బంది అక్కడి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ



మారుఫ్ హుస్సేన్

సదుం, ఆగస్టు 6: మండల తహసీల్దారుగా నియమితులైన మారుఫ్ హుస్సేన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక సిబ్బంది అభినందించారు. డీటీ కుమార్,ఏఎస్‌వో విజయ్, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల తనిఖీ

బైరెడ్డిపల్లె, ఆగస్టు 6 : పెద్దచెల్లారగుంట జడ్పీఉన్నతపాఠశాలను మంగళవారం డీవైఈవో చంద్రశేఖర్ తనిఖీ చేశారు. రికార్డులు, నాడు-నేడుపనులను పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న హెచ్ఎం రవికుమార్‌ను అభినందించారు.

అన్నదానం ట్రస్టుకు రూ.1.25 లక్షల విరాళం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 6: వరసిద్ధి వినాయకస్వామి ఆలయ అన్నదానం ట్రస్టుకు మంగళవారం ఏలూరుకు చెందిన బాలకృష్ణ రూ.1.25 లక్షల విరాళం అందించారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ రవి స్వామి దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందించారు.

రామకుప్పం టీడీపీలో కుర్చీలాట

●వైసీపీ ఎంపీటీసీల చేరికలో జాప్యం● ఖాళీగానే ఉన్న ఎంపీపీ పదవి

కుప్పం, ఆగస్టు 6: కుప్పం నియోజకవర్గంలోని మున్సిపాలిటీతోపాటు మిగిలిన మూడు మండలాలలోనూ వైసీపీనుంచి కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యుల చేరికలు జరిగిపోయాయి. రెండో విడత చేరికలు కూడా నేడో రేపో జరుగనున్నాయి. రామకుప్పం మండలం మాత్రం ఈ విషయంలో స్తబ్దుగా ఉంది. వైసీపీనుంచి ఎంపీటీసీలు టీడీపీలో చేరికకు సిద్ధంగా ఉన్నా ఎంపీపీ పదవికోసం పోటీ పడుతున్న నేతల వల్లనే ఈ స్తబ్దత నెలకొందంటున్నారు. కుప్పం మున్సిపాలిటీలో ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లు ఇప్పటికే టీడీపీలో చేరిపోయారు. కుప్పం, శాంతిపురం, గుడుపల్లె మండలాలలో 14 మంది వైసీపీ ఎంపీటీసీలు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రెండో విడతలో మిగిలినకౌన్సిలర్లను, ఎంపీటీసీలను తీసేసుకోవాలన్న ప్రయత్నాలు సాగుతున్నాయి. రామకుప్పం మండలంలో మాత్ర కదలిక లేదు. 17 ఎంపీటీసీ స్థానాలనూ అప్పటి అధికార వైసీపీ కైవశం చేసుకుంది. మణీంద్రం ఎంపీటీసీగా గెలిచిన వైసీపీ మండల కో కన్వీనర్ చంద్రారెడ్డి భార్య శాంతకుమారిని ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండేళ్ల క్రితం ఆమె మృతి చెందడంతో, ఎంపీపీ ఎన్నికోసం మూడుసార్లు సమావేశాలు నిర్వహించినా కోరం లేకపోవడంతో వాయిదా పడ్డాయి. నలుగురు ఎంపీటీసీలు వారం కిందటే టీడీపీలో చేరికకు సిద్ధంగా ఉన్నారని తెలిసింది. మరో ఇద్దరు కూడా సుముఖంగా ఉన్నా మండల నాయకులు చొరవ చేయకపోవడం విశేషం. ఎంపీపీ కుర్చీ కోసం అక్కడి టీడీపీ నేతల మధ్య పోటీ నెలకొనడమే ఇందుకు కారణంగా చెప్పుకుంటున్నారు. ఎంపీపీ స్థానం జనరల్ మహిళకు రిజర్వ్ అయింది. మణీంద్రం ఎంపీటీసీ స్థానంనుంచి తమ కుటుంబ సభ్యులైన మహిళలను పోటీలో నిలిపి, ఎంపీపీగా ఛాన్స్ కొట్టేయాలన్న ఆలోచన నేతల్లో ఉంది. ఉన్సిగానిపల్లె మాజీ సర్పంచి, ఎంపీపీ అభ్యర్థిగా అప్పట్లో ప్రకటించిన రామ్మూర్తి, తన భార్య సులోచనమ్మకు ఈ పదవిని ఆశిస్తున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ శ్రీరాములురెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి తదితరులతోపాటు మరికొందరు కూడా తమ కుటుంబానికి ఈ పదవిని ఆశిస్తున్నారు. ఎంపీపీ ఎవరికో తేల్చుకున్నాకే ఎంపీటీసీలను పార్టీలో చేర్పించాలన్న ఆలోచనతో చేరికలను ఆలస్యం చేస్తున్నారంటున్నారు. దీనిపై అధిష్ఠానం సీరియస్ అయినట్లు తెలిసింది. మంగళవారం నాటికి ఏడుగురిని టీడీపీ నేతలు సమీకరించారని తెలుస్తోంది. అధిష్ఠానం ఎవరిని నిర్ణయిస్తే వారికే మిగిలిన అందరూ మద్దతునిస్తామని మండల టీడీపీ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి చెబుతున్నారు. కోరానికి అవసరమయ్యే కనీసం 9 మంది ఎంపీటీసీలను సమీకరించి ఒకేసారి టీడీపీలో చేర్చుకుందామన్న నిర్ణయం కారణంగానే చేరికలు ఆలస్యమవుతున్నాయన్నారు.

మండల సచివాలయంలో ఉద్రిక్తత



ఎంపీపీ కుర్చీలో చంద్రారెడ్డి, నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, ఆగస్టు 6: మండల సచివాలయంలో వైసీపీ నేత ఎంపీపీ కుర్చీలో కూర్చోవడం వివాదాస్పదమైంది.. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులతో పాటు వైసీపీ మండల కో-కన్వీనర్ చంద్రారెడ్డి కూడా వచ్చారు. ఎంపీపీగా ఎన్నికైన తన భార్య మృతి తర్వాత ఈయన ఎంపీపీ సీట్లో కూర్చొంటున్నారు. ఎంపీపీగా వ్యవహరిస్తున్న వైస్ ఎంపీపీ సుబ్రహ్మణ్యానికి బదులు చంద్రారెడ్డి ఎప్పటిలా మంగళవారం కూడా ఎంపీపీ సీట్లో కూర్చొన్నారు. దీనిపై టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, ఆనందరెడ్డి, చిన్నికృష్ణ తదితరులు చేరుకుని చంద్రారెడ్డి తీరుపై ఎంపీడీవో వద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెళ్లి చంద్రారెడ్డి, ఇతర నేతలకు టీడీపీ నాయకుల అభ్యంతరాన్ని వివరించారు. దీంతో చంద్రారెడ్డి ఎంపీపీ చాంబర్ నుంచి పక్క గదిలోకి వెళ్లారు. వారిని తక్షణం మండల సచివాలయం నుంచి పంపాలని టీడీపీ ఎంపీడీఓను కోరారు. ఎంపీడీఓ, ఏఎస్ఐ రెడ్డిశేఖర్‌లు వారిని వెలుపలకు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో నాయకుల వాగ్వాదాల మధ్య కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇన్నాళ్లూ ప్రజా సమస్యలను గాలికొదిలేశారని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈనేపథ్యంలో పోలీసులు జోక్యం చేసుకున్నారు. వైసీపీ నేతలకు సర్ధిచెప్పి అక్కడ నుంచి పంపేశారు. కాగా మండలంలో 16మంది ఎంపీటీసీలుండగా సమావేశానికి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు రాలేదు. ఈవిషయాన్ని టీడీపీ నేతలు ఎంపీడీవోకు నివేదించారు. దీంతో 8మంది హాజరయ్యారు. మిగిలిన ఎనిమిది మంది దుమ్మా కొట్టారు. మధ్యాహ్నం 12:30గంటలకు సమావేశం ప్రారంభమైంది.

గిరిజన విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



పుంగనూరు రూరల్, ఆగస్టు6: డీఎంఅండ్ హెచ్‌వో ప్రభావతిదేవి, జిల్లా ట్రైబల్‌వెల్ఫేర్ ఆఫీసర్ మూర్తి మంగళవారం మేలుపట్ల లోని గిరిజ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలని సిబ్బందికి సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్లపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. ఏడుగురు జ్వరబాధితులను స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ జైసింహ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగం పెరగాలి



రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ సంధ్య

పలమనేరు, ఆగస్టు6 : సేంద్రియ, సాంప్రదాయ ఎరువుల వినియోగాన్ని పెంచుకోవాలని మండల వ్యవసాయ అధికారిసంధ్య పేర్కొన్నారు. మంగళవారం గుండ్లపల్లిలో గ్యాప్-పొలంబడి కార్యక్రమం కింద రైతులకు మెరుగైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. క్రిమిసంహారక మందుల వినియోగంలో మెళకువలను తెలియజేశారు. సాంప్రదాయ సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. పంటలకు ముందు మట్టి, నీటి నమూనా పరీక్షలు చేయించుకుంటే కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. వ్యవసాయ శాఖ ఏడీ అన్నపూర్ణాదేవి, ఏఈఓ కుమార్‌నాయుడు, రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు



చల్లా రామచంద్రారెడ్డితో నాయకులు,కార్యకర్తలు

రొంపిచెర్ల, ఆగస్టు 6: గానుగచింత పంచాయతీలోని వైసీపీకి చెందిన వంద కుటుంబాలు మంగళవారం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. సీఎం చంద్రబాబు పాలనకు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. టీడీపీ కండువాలు వేసి వారిని పార్టీలోకి రామచంద్రారెడ్డి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో లాయర్ సుదాకర్‌రెడ్డి, జయరామయ్య, దొరస్వామినాయుడు, చంద్రయ్యనాయుడు, జనార్థన్‌నాయుడు, బాలాజి, జయబ్బ తదితరులు ఉన్నారు.



ఒకరు ఐఏఎస్..మరొకరు ఐఎఫ్ఎస్. కర్తవ్య నిర్వహణలో నిత్యం బిజీబిజీగా గడపే ఆ ఇద్దరు ఉన్నతాధికారులకు మంగళవారం కాసింత ఆటవిడుపు దొరికింది. కడ ప్రాజెక్టు అధికారి వికాస్‌మర్మత్, జిల్లా అటవీశాఖ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి మంగళవారం ననియాలలోని ఎలిఫెంట్ క్యాంపును సందర్శించారు. ఏనుగుల కదలికలు, కంకీ ఆపరేషన్లపై ట్రాకర్లు, అటవీ సిబ్బందికి నిర్వహిస్తున్న అవగాహన శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన ఏనుగులను చూసి ముచ్చట పడ్డారు. వాటితో సరదాగా ఫొటోలు తీసుకున్నారు. -రామకుప్పం

తహసీల్దార్‌కు సన్మానం



పలమనేరు, ఆగస్టు6 : మండలంలోని చౌకదుకాణ డీలర్లు మంగళవారం తహసీల్దార్ అన్బునాథన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువకప్పి, సన్మానించారు. కార్యక్రమంలో డీలర్లు మునిక్రిష్ణ, సనావుల్లా, నరేంద్ర, జిలాని, పర్లన, నీలావతి, ఉమామహేశ్వరి, ద్రాక్షాయిణి, లియాకత్, రాజేష్, పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



కల్లూరు, ఆగస్టు 6: రామిరెడ్డిగారిపల్లి పంచాయతీ ఎలకబైలులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పాలాభిషేకం, కుంకుమాభిషేకం, గంధమాభిషేకం, అర్చనలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకృతుడైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనమిచ్చారు. ఉభయదారులుగా పాళెం పంచాయతీ కోటపల్లికి చెందిన ఉపాధ్యాయులు రాజేంద్ర కుటుంబసభ్యులు వ్యవహరించారు.

చెట్ల కొమ్మలతో రాకపోకలకు ఇబ్బందులు



గానుగచింత రోడ్డులో దట్టంగా చెట్లు

రొంపిచెర్ల,ఆగస్టు6: రొంపిచెర్ల-గానుగచింత- కమ్మపల్లె-చల్లంపల్లె రోడ్డు మార్గంలో ఇరువైపులా ముళ్లకంపలు, చెట్లు వ్యాపించి వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందిగా తయారయ్యాయి. ఈమార్గంలో గతంలో పలు ప్రమాదాలు జరిగాయి. మలుపుల్లో చెట్ల వల్ల డ్రైవర్లు బస్సు నడపడానికి యాతన పడుతున్నారు. చెట్ల కొమ్మలు తొలగించకపోతే వాహనాలు నడపలేమంటున్నారు. ద్విచక్ర వాహనాల వారూ తిప్పలు పడుతున్నారు.

పొదుపుతో ఆర్థికాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న సీసీ శారద

పుంగనూరు రూరల్, ఆగస్టు6: డబ్బుల పొదుపుతో మహిళా సంఘాల కుటుంబాలు ఆర్థికంగా బలపడతాయని సీసీ శారద పేర్కొన్నారు. మంగళవారం చదళ్ల పంచాయతీ పరిధిలో జరిగిన మహిళా సంఘ సభ్యుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మొదట మహిళా సంఘాలు ఏర్పాటు చేసి వారిని ఆర్థికంగా ముందుకు తీసుకువెళ్లాలనే ఆలోచనతో బ్యాంకుల ద్వారా రుణాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరెడ్డి, మనోహర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నిర్దిష్ట లక్ష్యంతో ముందడుగు: డీఎస్పీ



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్ విష్ణు

గంగవరం, ఆగస్టు 6 : నిర్దిష్టమైన లక్ష్యంతో లక్ష్యాన్ని సాధించేలా విద్యార్థులు కష్టపడి చదవాలని డీఎస్పీ రఘువీర్ విష్ణు పేర్కొన్నారు. మంగళవారం మదర్‌థెరీసా కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ స్థాయిలో విద్యార్థులు సాధించే మార్కులే భవిష్యత్‌లో స్థిరపడడానికి దోహదపడతాయన్నారు. సబ్జెక్టుపై పట్టు సాధించాలన్నారు. తద్వారా లక్ష్యాన్ని చేరుకోవాన్నారు. ఏ దశలోనూ క్రమశిక్షణ తప్పకూడదని హితవు పలికారు. కార్యక్రమంలో సీఐ చిన్నగోవిందు, కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, ఛైర్మన్ సునీల్, డైరెక్టర్ రాజేంద్రరెడ్డి రామమూర్తి లతోపాటు పలువురు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ప్రకృతి వ్యవసాయంపై ప్రణాళికలు సిద్ధం చేయాలి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 6: రైతులు ప్రకృతి వ్యవసాయం చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా రైతు సాధికార సంస్థ కార్యాలయాన్ని పరిశీలించిన ఆయన అక్కడి సిబ్బందితో ప్రకృతి వ్యవసాయంపై పలు సూచనలు చేశారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం చేసే దిశగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్ని ఎకరాల్లో ఏయే పంటలు ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేస్తున్నారనే దానిపై ఈనెల 15వ తేదీలోపు నివేదిక సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం పెంచుకోవాలి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 6: విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం పెంచుకోవాలని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి సూచించారు. మంగళవారం కళాశాలలో విద్యార్థులకు కేరీర్ గైడెన్స్ అంశంపై సెట్విన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన వక్త కౌటిల్య బ్యాంకు కోచింగ్ సంస్థ ఎస్ఎస్ రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం భవిష్యత్తు నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



యాదమరి, ఆగస్టు 6: మండలంలోని పాచిగుంట పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం గుణశేఖరన్ మంగళవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి చేతుల మీదుగా అందించారు. ఆమె మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా హెచ్ఎం ఉచితంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు ఇవ్వడం అభినందించదగ్గ విషయమన్నారు. గ్రామ పెద్ద దక్షిణామూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నదానం ట్రస్టుకు రూ.1.25 లక్షల విరాళం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 6: వరసిద్ధి వినాయకస్వామి ఆలయ అన్నదానం ట్రస్టుకు మంగళవారం ఏలూరుకు చెందిన బాలకృష్ణ రూ.1.25 లక్షల విరాళం అందించారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ రవి స్వామి దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందించారు.

ఐరాల ఉన్నత పాఠశాలలో డీఈవో తనిఖీలు

ఐరాల, ఆగస్టు 6: జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజులు మంగళవారం ఐరాల ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, వారితో కలిసి భోజనం చేశారు. పదో తరగతి విద్యార్థులు ఒక ప్రణాళిక ప్రకారం చదివి, ఇటు పాఠశాలకు, అటు తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఎంఈవోలు రుషేంద్రబాబు, దామోదర్ నాయుడు, హెచ్ఎం కోమల పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో ఈఈ తనిఖీలు

చిత్తూరు రూరల్, ఆగస్టు 6: చిత్తూరు రూరల్ మండలం బీఎన్ఆర్ పేట సబ్‌స్టేషన్‌ను చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర మంగళవారం తనిఖీ చేశారు. షిఫ్ట్ ఆపరేటర్లు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వ్యవసాయానికి విద్యుత్ అంతరాయం కలగకుండా అందించాలన్నారు. ఫిర్యాదుల పుస్తకాన్ని ఏర్పాటు చేసి, వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

ఉచిత దంత చికిత్స

చిత్తూరు రూరల్, ఆగస్టు 6: నగరంలోని అమ్మఒడి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత దంత శస్త్ర చికిత్స నిర్వహించినట్లు ట్రస్టు ఫౌండర్ పద్మనాభనాయుడు తెలిపారు. మంగళవారం వివిధ ప్రాంతాలకు చెందిన 15 మందిని చెన్నైలోని చెట్టినాడ్ డెంటల్ ఆస్పత్రికి తీసుకెళ్లి ఉచితంగా దంత శస్త్ర చికిత్స నిర్వహించామన్నారు.

బాలభారతి పాఠశాలకు విరాళం

యాదమరి, ఆగస్టు 6: మండలానికి చెందిన వల్లేరు వెంకటేశులునాయుడు, తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథనాయుడులు కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని బాలభారతి పాఠశాలకు రూ.10వేల విరాళం అందించారు. పాఠశాలకు అవసరమైన వస్తువుల కొనుగోలుకు వాడుకోవాలని కోరారు.

మానసిక ఒత్తిడికి గురికాకూడదు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 6: విద్యార్థినులు కౌమార దశలో మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ రామలక్ష్మి తెలిపారు. రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విజయం డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు మానసిక స్థితి, వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. మనోస్థయిర్యం, ఆత్మవిశ్వాసం, ధైర్యం, దృఢత్వం అలవర్చుకుంటే సమాజాన్ని జయించే శక్తి వస్తుందన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి

గుడిపాల, ఆగస్టు 6: మండలంలోని ఏఎల్‌పురం సమీపంలోని పాళ్యంకొండ అంజనేయస్వామి ఆలయానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర, ఏడీ పద్మనాభపిళ్లైను ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం కలిసి విన్నవించారు. పై అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని ఈఈ హామీ ఇచ్చారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించండి

వెదురుకుప్పం, ఆగస్టు 6: కుష్టు వ్యాధిగ్రస్తులను సత్వరమే గుర్తించాలని జిల్లా లెప్రసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రెడ్డెప్ప అన్నారు. మంగళవారం ఆయన పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది సమావేశంలో మాట్లాడుతూ కుష్టు అనుమానిత కేసులను గుర్తించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెఫర్ చేయాలని ఆదేశించారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

గుడిపాల, ఆగస్టు 6: దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ధనుంజయ నాయుడు అన్నారు. మంగళవారం బీజేపీ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎస్సీ, ఎస్టీ సెల్ సెక్రటరీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు చంద్ర, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు దేవరాజ్, బీజేపీ నాయకులు మాధవన్, మురారి, గోపి, రాజామణి, వేలాయుధం, నిత్యానంద పిళ్లై, దొరైరాజ్, రవి, జయవేలు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మెరుగైన విద్య



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఆగస్టు 6: టీడీపీ హయాంలోనే మెరుగైన విద్య అందుతోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, పీసీఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆయన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఇంటర్ విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేయలేదన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన 15 రోజుల్లోనే పుస్తకాలు పంపిణీ చేసిన ఘనత మంత్రి నారా లోకేశ్‌కే దక్కుతుందన్నారు. విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలపతి, టీడీపీ పట్టణాధ్యక్షుడు రమేష్‌బాబు, చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, నాయకులు బాలాజీ, మీరా, శ్రీనివాసన్, గుణశేఖర్ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డలకు పౌష్టికాహారం

తల్లిపాలే బిడ్డకు పౌష్టికాహారమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. నగరి డిగ్రీ కళాశాల మైదానంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో ఆయన పాల్గొన్నారు.

బాలికల వసతిగృహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



డీడీ రాజ్యలక్ష్మితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, ఆగస్టు 6: మండలంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలోకి వర్షపు నీరు చేరి విద్యార్థులు అవస్థలు పడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ మంగళవారం హాస్టల్‌ను పరిశీలించారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వెంకటప్పనాయని చెరువుకు వెళ్లే చెంగ్రాలయనాయుడు కాల్వను పరిశీలించారు. కాల్వను కొందరు ఆక్రమించుకుని ఇళ్లు కట్టుకోవడంతో నీరు వసతిగృహంలోకి వచ్చిందని తెలుసుకుని నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాయకులు లోకనాథం నాయుడు, జనార్దన్ గౌడ్, రమేష్, హరిప్రసాద్ ఉన్నారు.

భూ సమస్యలను సత్వరం పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్

కార్వేటినగరం, ఆగస్టు 6: నియోజకవర్గంలో భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని, ఉచిత ఇసుక పంపిణీ విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని ఎమ్మెల్యే థామస్ తహసీల్దారులను ఆదేశించారు. ఆరు మండలాల తహసీల్దారులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పేదలకు సహాయం చేయడానికి రెవిన్యూ అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండలన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం : ఎమ్మెల్యే



సంస్థ ప్రతినిధులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, ఆగస్టు 6: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు చిత్తూరు నియోజకవర్గంలో పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం బెంగళూరులో రీ యూసబుల్ బ్యాగ్‌ల తయారీ సంస్థ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. చిత్తూరు నియోజకవర్గంలో పరిశ్రమ స్థాపించాలని సంస్థ ప్రతినిధులను కోరారు. ఇందుకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే చెప్పడంతో సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ రవితేజ, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీగా మహేష్

చిత్తూరు సిటీ, ఆగస్టు6: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీగా నగరంలోని 17వ డివిజన్‌కు చెందిన సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ ఎ.మహేష్ ఎన్నికయ్యారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తోటకూర కోటేశ్వరావు, ప్రధాన కార్యదర్శి పుట్టి రత్నం చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. సహోద్యోగులు అభినందనలు తెలిపారు.

పేదలకు అన్నదానం



గుడిపాల, ఆగస్టు 6: మండలంలోని అన్న క్యాంటీన్‌లో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం చేశారు. మాజీ జడ్పీటీసీ సుమతి చేతుల మీదుగా ఈ కార్యక్రమం చేపట్టారు. రఘునాథ నాయుడు, సుబ్రహ్మణ్యం, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్పీ తనిఖీలు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 6: ఎస్ఆర్‌పురం పోలీసు స్టేషన్‌ను అడిషనల్ ఎస్పీ ఆరిఫుల్లా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కాబట్టి శాంతిభద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నగరి డీఎస్పీ సత్యనారాయణ మూర్తి, కార్వేటినగరం సీఐ సత్తిబాబు, ఎస్ఐ కుళాయిప్ప ఆయన వెంట ఉన్నారు.

ఐటీఐ మూడో విడత అడ్మిషన్లకు నేటి నుంచి దరఖాస్తులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 6: చిత్తూరు రూరల్ మండలం బీఎన్ఆర్ పేట ఐటీఐలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను మూడో విడత ప్రవేశాలకు బుధవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సాంబమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 26వ తేదీలోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు 29వ తేదీన కళాశాలలో ఇంటర్వ్యూలో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నింద్ర, ఆగస్టు 6: నింద్ర ఎస్టీ కాలనీకి చెందిన టీడీపీ నేత నాగరాజు కుటుంబాన్ని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పరామర్శించారు. నాగరాజు తండ్రి నారాయణ మేస్త్రీ(62) సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే నివాళులర్పించారు. నింద్ర దళితవాడలో మృతి చెందిన రాజ్‌కుమార్(35) కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

సీహెచ్‌సీలో ఎమ్మెల్యే తనిఖీలు

పెనుమూరు, ఆగస్టు 6: పెనుమూరు సీహెచ్‌సీని ఎమ్మెల్యే థామస్ మంగళవారం తనిఖీ చేశారు. వరండాలోనే రోగులకు చికిత్స అందిస్తుండటం గమనించారు. రిజిస్టర్ తనిఖీ చేసి, డాక్టర్లు తక్కువగా ఉండడం గుర్తించారు. రాత్రి పూట డాక్టర్లు ఉండడం లేదని, అత్యవసరమైతే చిత్తూరుకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో రాత్రి కూడా డ్యూటీ డాక్టర్లను నియమించాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు.

వ్యాను, కారు ఢీ : ఒకరికి గాయాలు

గుడిపాల, ఆగస్టు 6: మండలంలోని బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలో వ్యాను, కారు ఢీకొన్నాయి. ఒకరికి గాయాలయ్యాయి. ఎస్ఐ నరేంద్రకుమార్ వివరాల మేరకు.. బెంగళూరు నుంచి చెన్నై వైపు వెళ్తున్న కారును, చెన్నై నుంచి చిత్తూరు వైపు వస్తున్న వ్యాను సీపీఎఫ్ ఫ్యాక్టరీ సమీపంలో ఢీకొన్నాయి. కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో బెంగళూరుకు చెందిన కార్తీక్ తీవ్రంగా గాయపడ్డాడు. మిగిలిన ముగ్గురికీ గాయాలు కాలేదు. కార్తీక్‌ను చికిత్స నిమిత్తం చిత్తూరు ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలి



ధర్నా చేస్తున్న కిసాన్‌మోర్చా నాయకులు

చిత్తూరు, ఆగస్టు 6: జిల్లా మామిడి రైతుల సౌకర్యార్థం మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కొత్తూరు బాబు, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయుడు డిమాండ్ చేశారు. జిల్లాలో రైతుల జీవనాధారమైన మామిడి, టమోటా, చెరుకు, పాలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు.

కాస్మొటిక్ చార్జీలు చెల్లించాలి..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న కాస్మొటిక్ ఛార్జీలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో సరైన మౌలిక సదుపాయాల్లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెండింగ్ మెస్ ఛార్జీలను విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న వార్డెన్, ఇతర పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

సానుభూతి కోసమే జగన్ డ్రామాలు

చిత్తూరు సిటీ, ఆగస్టు 6: కేవలం సానుభూతి కోసమే భద్రత తగ్గించారని మాజీ సీఎం జగన్ డ్రామాలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ విమర్శించారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం హోదాలో ముఖ్యమంత్రికి సమానంగా జగన్‌కు జడ్‌ప్లస్ కేటగిరి భద్రత కల్పిస్తుంటే తగ్గించారని ప్రచారం చేయడం బాధాకరమన్నారు. దీనిపై హైకోర్టులో పిటిషన్ వేయడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ప్రతిపక్ష నేతలకు, మాజీ ముఖ్యమంత్రులకు భద్రత తొలగించి, వారిపై దాడులు చేయించిన చరిత్ర ఆయనదేనని అన్నారు.

విశ్వహిందూ పరిషత్ నూతన కమిటీ

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 6: విశ్వహిందూ పరిషత్ జిల్లా కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. బ్రాహ్మణవీధి గీతా సంఘ భవనంలో జరిగిన సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడిగా పి.సురేంద్రరెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.రామమూర్తి, శోభారాణి, కోశాధికారిగా శివకుమార్, జిల్లా కార్యదర్శిగా వేలు, నగర అధ్యక్షుడిగా మురళి, హేమలత, గౌరిలను ఎన్నుకున్నారు.

అర్చకుల వివరాలు అందజేయండి

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 6: ప్రైవేటు ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకుల వివరాలను బుధవారం సాయంత్రం లోపు జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో అందజేయాలని జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వేణుగోపాల్ కోరారు. తెల్ల కాగితంలో పేరు, తండ్రి పేరు, బ్యాంకు ఖాతా వివరాలు రాసి, ఆలయం ఫొటో, అర్చకుల పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ జిరాక్స్ అందజేయాలని తెలిపారు.

టేకుమంద పాఠశాలలో హిరోషిమా డే



బంగారుపాళ్యం, ఆగస్టు 6: మండలంలోని టేకుమంద జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం హిరోషిమా డేని ఏపీజే అబ్దుల్ కలామ్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు నో వార్ ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు వేణురెడ్డి, సైన్స్‌క్లబ్ ప్రతిపాదకులు షంషీర్‌ఖాన్, విజయ్‌కుమారి పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా అరుణకుమారి

పాలసముద్రం, ఆగస్టు 6: పాలసముద్రం తహసీల్దార్‌గా అరుణకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె తవణంపల్లె మండలంలో తహసీల్దార్‌గా ఉండి బదిలీపై పాలసముద్రం వచ్చారు. రెవిన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని అన్నారు.

ఈ- క్రాప్ చేయించుకోండి

పాలసముద్రం, ఆగస్టు 6: మండలంలోని రైతులు సాగుచేసిన పంటలను ఈ-క్రాప్ ద్వారా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ అరుణకుమారి పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయశాఖ సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. ఈ-క్రాప్ నమోదు చేసుకుంటే ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, బ్యాంకు రుణాలు అందుకోవడానికి అర్హులన్నారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణం

నగరి ఆగస్టు 6: చింతలపట్టెడ ద్రౌపదీసమేత ధర్మరాజుల ఆలయంలో మంగళవారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. డాక్టర్ నటరాజన్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారి ఇంటి నుంచి సారెను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయాన్ని పుష్పాలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్నదానం చేశారు.

గద్దర్‌కు ఘన నివాళి

నగరి ఆగస్టు 6: ప్రజాకవి గద్దర్‌కు అంబేడ్కర్ సంఘ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సంతమైదానం వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అంబేడ్కర్ సంఘం జాతీయ కార్యదర్శి గోవిందస్వామి మాట్లాడుతూ పాటల ద్వారా గద్దర్ అణగారిన వర్గాల అభ్యున్నతికి ఉద్యమించారన్నారు. నాయకులు కిరణ్, సురేష్‌కుమార్, బాలకృష్ణ, విద్యార్థి నాయకుడు విజయ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

నగరి ఆగస్టు 6: మున్సిపాలిటీ పరిధిలోని పీవీకే ఫంక్షన్ హాలులో బుధవారం ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఈఈ చిన్నరెడ్డెప్ప తెలిపారు. వినియోగదారులు సమస్యలను తెలియజేస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

గాయపడిన బాలిక మృతి

వెదురుకుప్పం, ఆగస్టు 6: ప్రమాదంలో గాయపడిన బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. శవ పరీక్ష అనంతరం మృతదేహాన్ని మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వెదురుకుప్పం మండలం మాంబేడు కాలనీకి చెందిన జయచంద్రయ్య కుమార్తె ఉషారాణి(6) ఆదివారం స్నానానికి పెట్టిన వేడినీరు పడి తీవ్ర గాయాలపాలైంది. కుటుంబ సభ్యులు ఆమెను తిరుపతికి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. వెదురుకుప్పం పోలీసులు అక్కడికి చేరుకుని, శవ పరీక్ష అనంతరం మంగళవారం మృతదేహాన్ని అప్పగించారు.

మధ్యాహ్న భోజన కార్మికులపై వేధింపులు తగవు

నగరి, ఆగస్టు 6: మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ ఒత్తిళ్లు తగ్గించి, వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. నగరి సీపీఐ కార్యాలయం వద్ద యూనియన్ అధ్యక్షురాళ్లు జమున, కృష్ణవేణిల అధ్యక్షతన మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం నిరసన తెలిపారు. కోదండయ్య మాట్లాడుతూ పాఠశాలల్లో 20 సంవత్సరాలుగా సరైన జీతాలు లేకున్నా విద్యార్థులకు భోజనం చేసి పెడుతున్నారని తెలిపారు. అలాంటి వారిని మార్చాలనుకోవడం విచారకరమన్నారు.